క్లుప్తంగా

విజ్ఞాన యాత్ర ప్రారంభం

మక్తల్: మండల కేంద్రంలో విజ్ఞాన సందర్శన యాత్రను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పాం పంట సాగుపై అవగాహన కోసం రైతులు భద్రాచలం కొత్తగూడెం జిల్లాలోని అశ్వరావుపేట గ్రామానికి తరలివెళ్తున్నారన్నారు. అక్కడ సాగు చేసిన విధానం, మెలకువలు తెలుసుకుంటారని వివరించారు. ఇటువంటి యాత్రలు రైతులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

మాగనూర్(కృష్ణ): కృష్ణ మండలంలోని అల్లంపల్లిలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని సోమవారం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడి తేజ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా బైని అయ్యప్ప, ఉపాధ్యక్షుడు బోడి మల్లేష్, అధికార ప్రతినిధి సైబన్న, ప్రధాన కార్యదర్శి కొళ్ళ నర్సిములు, కార్యదర్శి కొనింటి భీమేష్, కోశాధికారి రాజు, సురేష్, బైని సాయిబన్న, అంజప్ప, తిమప్ప, మహేష్ ఎన్నికయ్యారు.

ఎంఈఓ కార్యాలయానికి చేరిన పాఠ్యపుస్తకాలు



మాగనూర్: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు సోమవారం ఎంఈఓ కార్యాలయానికి చేరాయి. త్వరలోనే పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థికి అభినందన

ఊట్కూరు: మండల కేంద్రానికి చెందిన కుర్వ నీలమ్మ, హనుమంతుల కుమారుడు బాలరాజును నీట్‌లో ప్రతిభ కనబర్చడంతో సోమవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొర్రెల కాపరి కుమారుడు నీట్‌లో ప్రతిభ కనబర్చి ఎంబీబీఎస్ సీటుకు అర్హత పొందడం సంతోషకరం అని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఏదైన సాధ్యమన్నారు. విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాష్ రెడ్డి, ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కుర్వ గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలి

కోస్గి: డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డీకే రాములు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలో పేదలు ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని పేర్కొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి



దామరగిద్ద: రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు అవసరమైన పేదలను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నామన్నారు. 23వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జోషి, రాజు, వెంకటప్ప, బాలప్ప, రాములు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

మద్దూరు: రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొత్తపల్లి తహసీల్దార్ లతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వానాకాలంలో రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రజాపంథా నాయకుడు నర్సిములు, కొండప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

మరికల్: ఎన్నికల సమయం దగ్గర పడుతున్న సందర్భంగా ఓటరు జాబితా సర్వేను బీఎల్‌ఓలు వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ మాయాంక్ మిట్టల్ అన్నారు. మరికల్ మండలంలో చేపట్టిన సర్వేను సోమవారం పరిశీలించారు. కొందరు బీఎల్‌ఓలు అసంపూర్తిగా సర్వే చేసి సరైన వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేయడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంపూర్తిగా సర్వే చేస్తే సహించమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంకోటి, డీటీ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీశైలం, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



యంనోనిపల్లిలో..



నర్వ పీహెచ్‌సీలో..



కోస్గిలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్ పర్సన్

పచ్చదనంతో పల్లెలు కళకళలాడాలి

మాగనూర్: రాష్ట్రంలో అటవీ శాతాన్ని పెంచాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఎన్‌హెచ్167 హైవే డివైడర్ మధ్య మొక్కలు నాటి హరితోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలే కాదు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ హరిహారతం కార్యక్రమానికి రూపకల్పన చేశారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజలు, పార్టీ ప్రతినిధులు ప్రతీ ఒక్కరి భాగస్వామ్యంతో నేడు రాష్ట్ర పచ్చదనంతో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, సర్పంచ్ రాజు, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, ఉపసర్పంచ్ సుధ, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, డీటీ అమీర్, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, ఈశ్వర్‌యాదవ్, నేతాజీ, పల్లె మారెప్ప, చంద్రశేఖర్, సత్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో సోమవారం నిర్వహించిన హరితోత్సవానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ అంబాజి, వైస్ ఎంపీపీ ఎల్లగౌడ్, నాయకులు లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా మండలంలో..

పల్లెలన్ని పచ్చదనంతో కళకళలాడాలని ఎంపీపీ పూర్ణిమపాటిల్ అన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న హరిత హార కార్యక్రమంలో భాగంగా సోమవారం కృష్ణా మండలం హిందూపూర్ సమీపంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ శాలిని, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూరు పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నర్వ: ఆస్పత్రి ఆవరణలో చల్లని నీడనిచ్చే మొక్కలతో పాటు పూలు, వివిధ రకాల మొక్కలను నాటి పచ్చదనం పెంచాలని ఎంపీపీ జయరాములు శెట్టి అన్నారు. సోమవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నర్వ పీహెచ్‌సీ ఆవరణలో హరిత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌కుమార్, వైస్ ఎంపీపీ వీణావతి, సర్పంచు పెద్దింటి సంధ్య, పీహెచ్‌సీ వైద్యులు డా.కేశవ్, సిబ్బంది సీహెచ్‌ఓ ప్రభాకర్‌జెట్టి, సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితహారం దినోత్సవం నిర్వహించారు. మండలంలోని యంనోనిపల్లిలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు వహీద్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సద్గుణ, ఎస్ఐ రమేష్, ఎంపీటీసీ సుధీర్‌కుమార్‌రావు, సర్పంచు భారతి, పంచాయతీ కార్యాదర్శి మౌనిక, సచిన్, శివకుమార్, గొని రాములు, నర్సిములు, సిద్దప్ప, రాములు, నర్సప్ప, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గుండుమాల్‌లో ఎంపీపీ మధుకర్ రావు, బోగారం, కడంపల్లి, నాచారం గ్రామాల్లో జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మున్సిపలిటీ పరిధిలో మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీష అధికారులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటయ్య, ఎంపీఓ రహమత్, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్దూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవ కార్యక్రమాన్ని మండలంలోని పెదిరిపాడ్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎస్ఐ శీనయ్య, వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, పెదిరిపాడ్ సర్పంచ్ బాలప్ప ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, అధికారులు మొక్కలు నాటారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో హరితహారం కార్యక్రమం చేపట్టారు. మండలంలోని ఆయా గ్రామాల్లో హరితహారం కార్యక్రమాన్ని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రారంభించారు.



హిందూపురం పాఠశాల ఆవరణలో..



పెదిరిపాడ్ కస్తూర్బాగాంధీ పాఠశాల ఆవరణలో..

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మాగనూర్(కృష్ణా): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేయనున్న అందజేయనున్న రాగిజావకు సంబంధించిన సామగ్రిని కాంప్లెక్స్ హెచ్‌ఎం నిజాముద్దీన్ ఆధ్వర్యంలో కృష్ణా మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు అందజేశారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంఈఓ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 20వ తేదీన ఉదయం 7:15 గంటల నుంచి ప్రతి గ్రామంలో ర్యాలీలు నిర్వహించి ఉదయం 8 గంటలకు ఆయా పాఠశాలల అవరణలో జాతీయ జెండా విష్కరించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, తెలంగాణ పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలని సూచించారు. అనంతరం మెనూ సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శేఖర్, అమీర్, నాగరాజ్, ఎంఐఎస్ నరేష్, సీఆర్పీలు అమీన్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



మెనూ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్రాములు అన్నారు. సోమవారం మండలంలోని నాచారం ప్రాథమికోన్నత పాఠశాలతో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ఉచితంగా మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తుందన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజన రికార్డులు పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో హరితహారం పథకంలో భాగంగా మొక్కలు నాటారు. విద్యా దినోత్సవ వేడుకలకు రావాలని సర్పంచ్, హెచ్‌ఎంలు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. హెచ్‌ఎం మధుసూదన్, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటయ్య, ఉపాధ్యాయులు రాములు, వీరుమల్లేష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

12రకాల నిత్యావసర సరుకులు అందించాలి

నారాయణపేట టౌన్: రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు, 10 కిలోల సన్న బియ్యం ఉచితంగా అందించాలని, కొత్త రేషన్ కార్డులు, వంటగ్యాస్ సబ్సిడీతో రూ.500కు ఇవ్వాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్, పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి అన్నారు. సోమవారం పీఓడబ్ల్యూ, పీవైఎల్ రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోని పౌరసరఫరాల కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శారద, సౌజన్య, పీవైఎల్ అధ్యక్ష, కార్యదర్శులు పౌరసఫరాల శాఖ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సావిత్రమ్మ, లక్ష్మి, నాయకులు సునీత, సిద్ధు, బాలు, ఇస్మాయిల్, రాము, హన్మంతు, సాయి, మల్లేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ రోడ్‌లో ధర్నా చేపడుతున్న పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు

విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం



హెచ్‌ఎంలకు సామగ్రి అందజేస్తున్న సీఆర్పీలు

నర్వ: అవతరణ దశాబ్ది దినోత్సవంలో భాగంగా మంగళవారం నిర్వహించే విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని సీఆర్పీ నర్సిములు అన్నారు. సోమవారం ఎమ్మార్సీ కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్లు, రాగిజావ ప్యాకెట్లు, లైబ్రరీ ఏర్పాటు కోసం కార్పెట్లను, ర్యాక్‌లను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. సీఆర్పీలు రోజా, నర్సిములు, హెచ్‌ఎంలు మల్లేష్, సుదర్శన్ ఉన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

మాగనూర్: మండల కేంద్రంలోని నల్లగట్టు మారెమ్మవ్వ దేవాలయం సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలకు జిల్లా పరిషత్ ప్రహరీ నిర్మాణానికి జెడ్పీటీసీ నిధులు రూ. 5 లక్షలు మంజూరయ్యాయి. దీంతో సోమవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటయ్య, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, సర్పంచ్ రాజు, ఎస్‌ఓ రాధిక, బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గోవా మద్యం పట్టివేత

మాగనూర్(కృష్ణా): గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. సోమవారం కృష్ణా మండలంలోని రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు దగ్గర ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న 5.1 లీటర్ల మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఒకరిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

మాగనూర్(కృష్ణా): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణా ఎస్ఐ విజయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం కృష్ణా మండలంలోని అల్లంపల్లిలో ప్రజలకు సైబర్‌నేరాలపై పోలీసు కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బంపర్ డ్రా తగిలిందని, గిఫ్ట్‌లు వచ్చాయని ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్‌నేరానికి గురైతే టోల్‌ఫ్రీ నంబర్ 1093 కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సురేందర్, శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యానాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: జిల్లా ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ లింకులను ఎవరు కూడా ఓపెన్ చేసి సైబర్ నేరాలకు బలి కావొద్దన్నారు.

విద్యార్థులకు నాన్‌చాక్ అందజేత

మరికల్: బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం సర్పంచ్ గోవర్ధన్ నాన్‌చాక్‌లను అందజేశారు. మరికల్‌కు చెందిన ఆర్మీ జవాన్ యాదయ్య జన్మదినం సందర్భంగా ఆయన వంద మంది విద్యార్థులకు ఉచితంగా కరాటే నాన్‌చాక్‌లను ఇప్పించారు. వాటిని సర్పంచ్‌తో పాటు మాస్టర్ గొని శ్రీను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నారాయణపేట రూరల్: విద్యా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని జాజాపూర్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆవిష్కరణపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలకు 7 నుంచి పదో తరగతి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వ్యాసరచన పోటీలో శివరాములు ప్రథమ, భారతి ద్వితీయ, చిత్రలేఖనంలో రుత్విక ప్రథమ, శిరీష ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీజీ కనకప్ప, సత్యనారాయణ, భానుప్రకాష్, విజయ్‌కుమార్, మధుసూదన్‌రావు, నిర్మల పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ధన్వాడ: ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. సోమవారం మండలంలోని గోటూర్‌లో సబ్‌సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇనిస్టిట్యూషన్ డెలివరీ పిల్లలకు ఇమ్యునైజేషన్ వివరాలు తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందులో సర్పంచ్ నారాయణరెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి

కోస్గి: బీసీ కులవృత్తులకు ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష ఆర్థికసాయం పొందేందుకు గడువును పెంచాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చాల మంది దరఖాస్తుదారులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందలేదని పేర్కొన్నారు. దీంతో 70 శాతం మంది దరఖాస్తు చేసు కోలేకపోయారన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ఎలాంటి జాప్యం లేకుండా ధృవీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ కో కన్వీనర్ రాము, పార్టీ మండల అధ్యక్షుడు సీబీ వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్. ప్రధాన కార్యదర్శి శ్రీను తదితరులు ఉన్నారు.

దామరగిద్ద: కుల వృత్తిదారులకు అందించే రూ.లక్ష ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని పొడిగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. గడువు తేదీని పెంచాలని కోరుతూ తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన గడువు ముగుస్తున్నందున ఇంకా ఆన్‌లైన్ సమస్యల కారణంతో పాటు ధ్రువపత్రాల దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, నర్సిములు, రాములు, చెన్నప్పలు పాల్గొన్నారు.



బిజ్వార్‌లో వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

బిజ్వార్‌లో వైద్య శిబిరం

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో సోమవారం ముత్తూట్ మరియు జార్జ్ పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయ్యింది. గ్రామస్తులకు బీపీ, షుగర్, హైపర్‌టైటీస్ బి, క్రియాటిన్, కొలస్ట్రాల్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విజయన్‌గౌడ్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులున్న వారికి ఉచితంగా ముత్తూట్ పౌండేషన్ ద్వారా పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో పక్షం రోజులపాటు వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రమ్మ, వైద్యబృందం సుభాషన్, వెంకటేష్, గ్రామస్తులు పట్వారీ లక్ష్మన్న, బాలకిష్టప్ప, మహేష్‌గౌడ్, అశోక్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వరుణదేవా కరుణించు

నారాయణపేట టౌన్: జూన్ మూడో వారం ముగుస్తున్నా రాష్ట్రంలోకి రుతుపవనాలు అనుకున్న స్థాయిలో రాకపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నందున్నారు. వర్షాలు కురువాలని వేడుకుంటూ పట్టణంలో పరిమాళపురం ఆంజనేయ స్వామి ఆలయంలో భక్త బృందం, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీపాద కులకర్ణి ఆధ్వర్యంలో అఖండ భజన ప్రారంభించారు. అలాగే బుధవారం స్థానిక అనంత శయన స్వామి ఆలయంలో వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు గోవిందప్ప, ఊసేనప్ప, బాపన్‌పల్లి నర్సప్ప, బుగ్గప్ప, రామప్ప, బస్వరాజ్, ప్రభాకర్‌రెడ్డి, లింగు తదితరులు పాల్గొన్నారు.



అఖండ భజన చేపడుతున్న భక్త బృందం

కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తాం



మక్తల్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేయడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు సుజేంద్రశెట్టి దీమా వ్యక్తం చేశారు. సోమవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామని, అందరూ పార్టీ విజయం కోసం పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో రాష్ట్ర పీసీసీ కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, రంగినేని అభిలాస్ రావు, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సిములు, గోవర్ధన్, ఇర్ఫాన్, అనిల్, రమేష్, వెంకటేష్, శివ, సుధాకర్, సదాశివారెడ్డి, మహ్మద్‌గౌస్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



నారాయణపేటలో..